# చలిత

సి. డి. యస్. రామయ్య

గడియారం గంటలు కొట్టిన చప్పుడవడంతో పార్వతి హృదయంలోని ప్రశాంతత చలించింది. ముఖమెత్తి గోడగడియారంవేపు చూసిందామె. ఆ గడియారం చల్లగా ఏడుసార్లు గంటలు కొట్టి, మళ్లీ యథాతథంగా తన కర్తవ్యాన్ని ప్రారంభించింది....

దిద్దుతున్న కాంపోజిషన్ పుస్తకాలను అవతల పెట్టి, ఉస్సురుమని నిట్టూర్చింది. నీరసం నిండుకున్న తన ముఖాన్ని పైట చెరగుతో అద్దుకుంది. పిదప— వాకిలి గడిచి బయటికి వచ్చి వీధిలోకి ఒక్కసారి చూసింది: ఆమె చూపు దేని కోసమో వెదకుతున్నట్లు కనిపించ సాగింది....

అప్పటికి వీధిమాత్రం నిర్మానుష్యంగా లేదు: మునిసిపాలిటీవీధి దీపాలు వెలుగుతోందన్నట్లిరులో అక్కడక్కడా వెలుగుతున్నాయి.... ఎక్కడో ఒక్కచోట మానవ శ్రీ నీడలు కన్పిస్తున్నాయి...

'శారద యిల్లు చేరుకోవడానికి రోజూ ఇంత ఆలస్యం జరుగు తుందేమిటి?' అనితనను తాను ప్రశ్నించుకున్నప్పుడు, దానికి సమాధానం ఇవ్వగల వారెవరూ ఉండరని, తనకు తాను సమాధానం చెప్పుకుంది.

పార్వతి అందవికారికాదు; అయితే ఆమెకు అలంకరణలు అంటుక రాని వస్తువులని శాసించింది సమాజం!

ఆమెది జీవితపొంగులు ఉడిగిపోయిన వయస్సు కాదు: కాని జీవిత సుఖాలకు దూరంగా వుండడం నీ రాత అని శపించింది హైందవ శాస్త్రం.!

ఆమె హృదయం తీయని కోరికలకూ,మధుర స్వప్నాలకు నిలయంఅని చెప్పడంలో అసత్యం లేదు. అయితే, ఆవాంఛలన్నీ అంతరాత్మకు అంటరాని వర్జ్యాలని ఎత్తి పొడిచింది సంఘం!

కైపు నిండిన మధులాగా— అభిరుచులు నిండిన ఆత్మగల నడి వయస్సు మగువపార్వతి!కాని—

ఆమె ఓ విధవ!!

తిలకంలేని ఆమె ముఖం, చూడడానికి అందంగా లేదని అనుకోవడం పొరపాటు: సమాజం విధించిన శాస్త్రోక్త పరీక్షల వల్ల, ఆమె శరీరంలోని పొంగులు అట్టే ఉడికిపోయాయని తలవడంకూడా అపచారం! అన్నిట కంటే మిన్నగా — ఆమెను లోకంలో నిరుపయోగమైన వస్తువుగా పరిగణించడం, మరీ గొప్ప—పెద్ద తప్పు !!

వీధిలోకి అటూ ఇటూ చూస్తూ నిలబడ్డ పార్వతి—అల్లంత దూరంలో, చేతిలో పుస్తకాలతో నడిచి వస్తున్న శారదను గుర్తించిందికాని, ఆమె తోటే, మరో యువకుడు—సైకిలు తోసుకుంటూ రావడం గమనించే సరికి పార్వతి శరీరం ఒక్కసారి ఆశ్చర్యంతో జలదరించింది. ఆ దృశ్యం నిజమేనా అన్న సందేహంకలిగినా తను చూస్తున్నది తన రెండు కళ్లతోనే అన్న నిశ్చయానికి వచ్చిన తర్వాత—ఆమె అబల హృదయం ఆవేశంతో ఉడికిపోయింది. 'శారద రోజూ ఆడుతున్న నాటకం ఇదా!' అన్న సరైన జవాబు గూడా, ఆమె అంతరాత్మనుండి వెలువడింది. తన కున్న ఆవేశంలో— శారదను నాలుగు వాయించాలన్న వెర్రి ఆవేశం అనుభూతి కలిగినా, ముక్కు మొగం తెలియని పరాయి మొగవాడి యెదుట ఆమెను అలా అవమానించడానికి, తన అనురాగ అనుబంధం సమ్మతించలేదు.... కాబట్టి, జరగలదేదో ఇంటిలోపలే జరిపించాలని, తన ఆవేశాన్ని అణచుకొని లోపలికి నడిచిందామె. ముందు వాకిలిలో—తలుపు చాటున నిలుచుని, శారద రాక కోసం ఎదురు చూడ సాగింది......

వీధి ముంగిట'వాళ్లు' ఆగారు; పార్వతికి అలా అనిపించింది.పిదప 'వాళ్ల'మాటలు వినిపించాయి,

"శారదా!....నే వెళ్తాను"— ఇది'అతని' కంఠం నుండి బయటువడ్డపలుకులని పార్వతి గుర్తించింది.

"మా పట్నదలే మాది!... ఒక్కసారి లోపలికి రండి మూర్తిగారూ!..మరే మనుకోకండి!... ఇంత దూరం రానేవచ్చారు.. మాయింటి లోపలికి రావడానికేం అభ్యంతరం?"—ఇది శారద నోటినుండి వచ్చిన మాటలని పసిగట్టింది పార్వతి.

"ఫరవాలేదు; మన అనుబంధం ఈనాటితో తీరిపోయేది కాదుగదా!...మరోసారి వచ్చినప్పుడు తప్పక వస్తాను! ఈసారి మాత్రం..."

"ఇప్పుడు మాత్రమేం!తెలిసీ తెలియనివాళ్లింట్లోకి వెళ్లడం వల్ల, ఏదేనా అపచారం జరగగలదేమోనని సందేహిస్తున్నారా?మీకా భయం అక్కర్లేదు; మావదిన చాలా మంచిది: మరేవిధంగానూ అనుకోదు! రండి లోపలికి! మావదినను మీకు పరిచయం చేస్తాను. !.."

"శారదా!..నీ ఆంక్ష, కాంక్ష—నాకు మాత్రం తెలియదనుకున్నావా?కాని, ఇప్పటి స్థితిలో నేను రాలేక పోతున్నానని నీకు తెలియదు!"

"ఏమిటి, నాకు తెలియంది?"

"హోటల్లో నాలుగు మెతుకులు ఎంగిలిపడి, రాత్రిపని ఉద్యోగానికి తొమ్మిదింటికల్లా నేను వెళ్లాలని నీకేం తెలుసు !"

"ఓహో!.."

"సరేమనుకకు, వస్తాను....."

తలుపు చాటున ఉన్న పార్వతి ఈ మాటల్లో మళ్లీ సంచలనం బయలు దేరింది. తను ఆవేశపడిన స్థాయిలో శారద ప్రవర్తనలో ఎలాటి నీచత్వపు నీడలూ కన్పిస్తున్నట్లు ఆమెకు అనిపించ లేదు. సగం భారం తొలగినట్టు నిట్టూర్పు విడిచి, కాలుగాలిన పిల్లిలా—హాలులోకి వెళ్లి టేబిలు ముందు కూర్చుంది..


ఇంటిలోకి ప్రవేశించిన శారద చెప్పులు విడిచి తన గదికి వెళ్లి పుస్తకాలు వగైరా వదిలిపెట్టి హాలులోకి వచ్చింది. తను వచ్చిన అలికిడైనా గుర్తించడానికి ప్రయత్నించలేదని, పార్వతికేసి చూసి నిట్టూర్చింది.....

"భోంచేద్దాం, రా—వదినా!"అని ఆమెను ఆహ్వానించింది— శారద.

"నాకిప్పుడేం వద్దు—నువ్వు వెళ్లి తినరా !... అని పూడుకుపోయిన గొంతుకను సకిలించుకుని అంది పార్వతి... ఆమె సమాధానంలోని సంచలనాన్ని గుర్తించిన శారద — ఆమెను మళ్లీ మళ్లీ పలకరించడానికి కష్ట పడలేదు. చల్లగా—లోపలికి వెళ్ల బోయింది...

మౌనం వహించింది శారద!

"అడిగిన ప్రశ్నకు చెప్పు! ... వయస్సు వచ్చిన దానికి ... అలా తిరగడంవల్ల లోకం ఏమను కుంటుందన్న బుద్ధి అయినా వుండక్కర్లా! ... పోనీ, నీయిష్టం వచ్చినట్టు తిరగడానికి, నీకు నువ్వే పెద్దదిక్కువయ్యావని నీఅభిప్రాయమా?" అని గద్దించింది ప్రశ్నించింది పార్వతి.



"అలాంటిదేమీ లేదు, వదినా!" అని, నాలుగు మాటలూ అతిక్ష్మంమీద జవాబిచ్చి వూరుకుంది శారద.

పార్వతి విచిత్రంగా శారదకేసి చూసింది: "ఎవరతను ?" అని మెల్లిగా అడిగింది.

"ఎ ... వ... రూ ?" అని ఎదురుప్రశ్న వేసింది శారద — పిరికితనంతో.

"నీకు తోడునీడై వచ్చి, మన యింటివద్ద నిన్ను విడిచిపెట్టి వెళ్ళిన అతను ?"—

తన వదినను తనను ఆప్యాయంగానే అడుగుతున్నదని అనుకుంది శారద. నిజం చెప్పాలని గూడా ఉబలాట పడింది! కాని, ఏ హైందవ స్త్రీ గూడా — తన ఎదలో మధుర తుంపరలు వెదజల్లు గలిగిన ఏ మగవాణ్ణి గురించిన వివరాలను, పరాయి వారికి తెలియ జెయ్యడం సహజంగా జరగ గలదేనా ?

"అతను ... అతన్ని నేనెరుగుదును" అని తడబడుతూ జవాబిచ్చింది.

ఎలా ఎరుగుదువన్న ప్రశ్నను విదిలించాలని పార్వతికి అనిపించినా, ఆ ప్రశ్నను అడగడంవల్ల సంతృప్తినివ్వగల సమాధానం అందుకోలేనని సందేహించి, ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

"శారదా! స్త్రీల విషయంలో — లోకం చెడ్డదన్న వాదాన్ని పూర్తిగా అసత్యం అని కొట్టిపారేయలేము, అలాగని సత్యం అనిగూడా వాదించలేము ...అలాగే — పరిచయం ప్రాణాలను కలుపుతుందన్న వాదన ఎంత నిజమో, వేషం కట్టిన విచిత్ర వ్యక్తులచేత మోసాలను పెనవేసి, ప్రాణాలను తోడేస్తుందన్న వాదనకూడా సత్యదూరం కాదు. అతనెవరో ఎలాంటివాడో, ఎక్కడివాడో మొదలైన విషయాలు నాకు తెలియక పోయినా లోకం పోకడలను గురించి కొన్ని మాటలు నీకు చెప్పదలుస్తున్నా ... విచిత్ర వేశాలను కట్టి పైకి మంచివారుగా కన్పించే కొందరు పెద్దమనుషులు — ఆఖరికి మృగాలకంటే నీచంగా కన్పించే కొందరు పెద్దమనుషులు — ఆఖరికి మృగాలకంటే నీచంగా ప్రవర్తిస్తారు గూడా! ఈకోవకు చెందిన వాడుగా — నీపరిచితుడు ఉండకూడదనే నా ఆశయం ! కాని, నిజం నిప్పులాంటిది, దాన్ని రుచి చూడడం అంత తేలికైన పనికాదు .. మీ పరిచయంలో — ఎలాంటి నీచత్వమూ జరిగి వుండదనే భావిస్తున్నాను ..."

పార్వతి హితోపదేశంలోని గూఢార్థాన్ని గ్రహించిన శారద — "లేదు, వదినా ! ... పిచ్చి వూహలతో — ఏవిధమైన నీచప్రయత్నాలలోకి జారబడడానికి — మేమెప్పుడూ ఆలోచించనైనా లేదు. చేపట్టకముందే చేయి చేసుకోవడానికి, మూర్తి — అదే అతని పేరు — అంతటి నీచుడుగాదు—" అంది, తన పరిచితుడ్ని గురించిన గుణగణాలను ఎరుకచేసే తీరులో!

"అదే నాకోరిక గూడా! — కళ్ళకు నిండిన, నీకు అనువైన వాణ్ణి ముడిపెట్టడంకంటే, నాకు కావలసిందేముంది చెప్పు! మీ అన్నయ్య ఆశయానికి విరుద్ధంగా ఏదీ జరుగకుండా ఉంటే, అదే చాలు! ...సరే ఆ మూర్తి వివరాలేవో తర్వాత చెపుదువుగాని, నువ్వు వెళ్ళి అన్నం తినిరా!" అని కంపోజిషన్ పుస్తకాల్ని మళ్ళీ విప్పింది పార్వతి!

శారదలేచి, వంటగదివేపు నడిచింది.

'తెలివైన పిల్ల! ... అన్నకు తగ్గ చెల్లెలుగా ఉండక పోతుందేమిటి ? అని మనస్సులో తలుచుకొని చిరునవ్వు నవ్వుకుంది పార్వతి ... ఎదురుచూడని విధంగా ఆమె దృష్టి — ఎదురు గోడ మీద ఉన్న శారద అన్నయ్య రంగరాజు చిత్తరువు మీదికి మరలింది. మరోక్షణం తర్వాత ఆమె చిరునవ్వు మటుమాయమైంది ... ఆమె హృదయం బరువైంది, ముఖం కళా విహీనమైంది ... చిత్తరువులోని భర్త ప్రతిబింబాన్ని చూస్తున్నంతలో ఆమె హృదయంలో విచార తరంగాలు ఝల్లున పొంగుకొచ్చాయి.

• • •

పసితనంలోనే తలి దండ్రులను కోల్పోయిన

పార్వతి, మహిళా సంఘపు ఆదరణవల్ల ఎనిమిదవ తరగతి వరకూ చదివి, ట్రైనింగు ప్యాసయి— ఉపాధ్యాయిని వృత్తిలో ప్రవేశించింది. . . వృత్తిలో, పసిపిల్లల తీపి మాటలు ప్రవృత్తిలో మరో లోకాన్ని గురించి కలలు కంటూ — లేత వయస్సునష్ట గడిచిన సమయంలో —

పంతులమ్మ పార్వతి అప్పుడు — అయిదో తరగతి టీచరమ్మ!

పట్టుమని పదేళ్ళు నిండని శారద — అప్పుడు ఆమెదగ్గరే చదువు కుంటోంది. పల్చగా, పొట్టగా బారె బుగ్గలు నిండిన ముఖంతో — చూడడానికి అందమనిపించే శరీరంతో ఉండే ఆ అమ్మాయి లేమితనంతో బాధపడుతోందన్న విషయం, ఆ అమ్మాయి తొడుక్కునే బట్టలను బట్టి పార్వతి తెలుసుకుంది. ఆ అమ్మాయిని చూస్తున్నప్పుడల్లా — తనకు ఒకవిధమైన జాలి పుట్టేది.

బడి తెరచి నాలుగు నెలలయినా, తెలుగు పుస్తకం కొనుక్కోలేదన్న కారణంగా — శారదను ఒకరోజు గట్టిగా మందలించింది ... తన పరిస్థితిని నోరు విడిచి చెప్పలేని శారద కన్నీరు కార్చింది.

మరునటిరోజు —

బడికి ఆలస్యంగా వచ్చిన శారద, తరగతిలోకి ప్రవేశించకుండా — టీచరమ్మ అనుమతి కోసం తరగతి బయట నిల్చుని ఉండి పోయింది.

ఆ విషయం గమనించిన పంతులమ్మ — "శారదా! పాతపుస్తకాలు కొనుక్కోవడానికి శక్తి లేకపోయినా, కనీసం బడికి వేళకి సరిగ్గా రావడానికి కూడా వీలుపడలేదా, నీకు ? — అంత కంటే చదువు మానేసి, ఇంట్లోనే ఉండిపోవచ్చును గదా!" అని ఆ అమ్మాయిని మందలించింది.

తరగతిలోని పిల్లలయెదుట, తనకంత అవమానం జరిగినందుకు సిగ్గుపడి, ముఖం దించుకొని నిలబడింది శారద.

"ఎందు కాలస్యంగా వచ్చావు ?" — అని గద్దించి అడిగింది పంతులమ్మ.

టీచరమ్మ కోపానికి గురి అవుతున్నందుకు, శారద పసిహృదయం బాధపడింది. పిరికితనం వల్ల ఆ అమ్మాయి కళ్ళలో నీళ్లు తిరిగాయి. . . కాని, గట్టిగా ఏడ్వలేకపోయింది. . .

"టీచర్! — మా అన్నయ్యకు జ్వరం మరీ అధికంగావుంటే, ఆస్పత్రికి తీసుకెళ్లి, మందు తీసుకొచ్చి, యిచ్చివస్తున్నా, టీచర్!. . ." అని సమాధాన మిచ్చింది శారద.

"దొంగసాకులు చెప్పడానికి ఎక్కడ నేర్చుకున్నావ్ ?"

"లేదు, టీచర్! నిజంగానే!"

"ఆ పనులేవో చేయడానికి నువ్వే వెళ్లాలా ? మీ నాన్న అమ్మలు లేరూ ?. . ."

"చచ్చి. . .పోయా. . రు!" అని జవాబిచ్చి ముఖం దించుకుంది శారద. . . ఆ అమ్మాయి చెప్పిన జవాబు — ఓ ములుకై, పంతులమ్మ హృదయంలో నాటుకుంది. . . మళ్లీ ఆ అమ్మాయిని మరేవిధంగానూ మందలించడానికి ఆమె అంతరాత్మ సమ్మతించలేదు. . . శారదను లోపలికి వచ్చి కూర్చోమని చెప్పింది. . . కన్నీళ్ళు తుడుచుకుని ఆ అమ్మాయి తరగతిలో కూర్చుంది. కొన్ని నిమిషాలవరకూ తరగతిలో నిశ్శబ్దత ఆవరించింది. . . .పసితనం కష్టమన్నది తెలియకుండా ఆనందంగా జీవించవలసిన శారద దురదృష్టాన్ని తలుచుకుని పశ్చాత్తాపపడింది. . .బడి వదిలిం తర్వాత, ఆ అమ్మాయిని గురించిన వివరాలను అడిగి తెలుసుకుంది.

శారదకూడా తనలాగే చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన దురదృష్టవంతురాలనీ, ఏకైక నీడగా వుంటున్న ఆ అమ్మాయి అన్నయ్యా —రంగరాజు — ప్రెస్సులోచిన్న నౌకరీ చేస్తూ, జీతంపేరిట వచ్చే నలభై రూపాయలను చాలీ చాలని తనంగా జీవిస్తున్నారనీ — గ్రహించి, పార్వతి ఆ అమ్మాయిమీద సానుభూతి కనపరచింది.

చదువులో, మందమతికాని శారదకు అన్ని సౌకర్యాలను చేకూర్చితే — బాగా అభివృద్ధిరాగలదన్న నమ్మకం ఆ పంతులమ్మకు దృఢంగా ఏర్పడింది. ఆ ఆశయంతో — శారదకు కావలసిన పుస్తకాలూ అవీ తనే కొని ఇచ్చి, బాగా చదువుకోవాలని ప్రోత్సాహమిచ్చింది. . . ఆ ఫలితంగా— ఆ సంవత్సరం, తరగతిలోకల్లా ఫస్టుమార్కులతో శారద ఉత్తీర్ణురాలయింది. తన ఆదరణ ఆ అమ్మాయికి మంచిఫలితాన్నిచ్చినందుకు పార్వతి ఆనందించింది.

తన చెల్లెలు తరగతిలో ఫస్టుమార్కులతో పాసయిందన్నవార్త విన్న రంగరాజు — ఆ పంతులమ్మకు కృతజ్ఞత తెలపడానికై — ఒకానొక రోజు శారదను తోడు తీసుకుని, పార్వతి యింటికి వెళ్ళాడు. . . . ఆ అమ్మాయి తెలివితేటల్ని గురించి అతనివద్ద గొప్పగా మెచ్చుకుందామె. రంగరాజు ఆనంద బాష్పాలు రాల్చాడు. . . అదేసమయంలో —నిరుపేద అయిన తనకు చెల్లెలుగా పుట్టి ఉండక, ఉన్నవాళ్లింట్లో బిడ్డగా పుట్టివుంటే, శారద యెంతో హాయిగా జీవించగలిగేదని కుమిలి పోయాడు. .. .

తర్వాతి సంవత్సరం — దారిద్ర్యానికి తలవంచి, తన చెల్లెలిని చదువు మాన్పించాలని అనుకున్నాడు రంగరాజు. ఆ విషయం తెలుసుకున్న పార్వతి, అతని ఆశయం సరైనదికాదని వాదించింది.

"చదువు సంధ్యలు చేకూరడం వల్ల— ఆడదాని జీవితం బాగుపడదనే మీ అభిప్రాయాన్ని దయచేసి విరమించుకోండి!" అంది.

రంగరాజు పేలవంగా నవ్వాడు : "పంతులమ్మగారూ!. . . మీ రనుకున్నట్లు, నాకా అభిప్రాయం ఎప్పుడూ కలగలేదు, కాని, ఇప్పుడు మేమున్న జీవితరంగంలో — శారదకు చదువు చెప్పించలేననే మీకు మనవి చేస్తున్నాను.. . . వస్తున్నది చాలీచాలని జీతం. అది మా యిద్దరికీ చాలినంత తిండికిగూడా సరిపోవడంలేదు. . . ఈ పరిస్థితుల్లో. . ."

"కష్ట పరిస్థితుల్లోనే ధైర్యంగా వుండాలని, పెద్ద వాళ్లంటారు. . . అదీ నా అనుభవంలో గూడా జరిగిందే!. . . చూడండి! శారద, తన్ను తాను పోషించుకోగలవరకైనా — అంటే ఏ ఎనిమిదవ తరగతికైనా చదివించడానికి ప్రయత్నించండి!"

"నా కా ఆశలేదని మాత్రం మీరనుకోకండి, దయచేసి!. . . తనపొట్టను తాను నింపుకోగల శక్తి నివ్వగల చదువున్నైనా — దాన్ని చదివించాలనే నేనూ అనుకుంటున్నాను. . . కాని, దాన్ని చదివించగల తాహతు నాకేదీ! భగవంతుడు చిన్న చూపు చూస్తున్నాడు గదా!. . ."

ఆఖరికి — పార్వతి ఓ నిశ్చయానికి వచ్చింది.

"పోనీ, నాకు తోచిన సలహాను చెప్పదలచుకున్నా. . మరేమనుకోరుగదా!. . ." అంది పార్వతి, నెమ్మదిగా.

"శారద జీవితానికి లాభంగా ప్రయోజనపడ గలిగితే, ఎవరి సలహానైనా అంగీకరించడానికి నేను సిద్ధంగావున్నాను.."

"శారదను నాతోనే ఉంచుకుని— దానికి కావలసినంతవరకూ చదువు చెప్పించడానికి ప్రయత్నిస్తాను...."అని చిరునవ్వుతో సమాధాన మిచ్చింది పార్వతి.

"పార్వతీ!. . ."అని మొట్ట మొదట సారిగా పేరెట్టి పిలిచాడు రంగరాజు...మనస్సులో దాగిన అనుబంధాన్ని కళ్ళలోకి తెచ్చుకుని అతని కళ్లలోకి చూసింది పార్వతి...తనను పేరెట్టి పిలిచిన మొదటి వ్యక్తి రంగరాజు.....ఆ పిలుపుల తన శరీరాన్ని పులకించగల మరో అనుభూతి కలిసి వున్నట్లు, తను ఆనందించింది!

"శారదనుంచి దూరం చేసిన పిదప,నన్ను ఏకాకిగా బ్రతకమనేనా మీ సలహాని అంతరార్థం?"అని కన్నీళ్లను క్రుమ్మరించి ప్రశ్నించాడు రంగరాజు.

"మిమ్మల్ని ఏకాకిగా బ్రతకమని నా ఉద్దేశం కాదు.! వీలయితే మన ముగ్గురమూ కలసి ఉండామనే నా కోరిక!—"

"అంటే?"

సిగ్గు తెరలను తొలగించుకుని—అతని ముఖంలోకి సూటిగా చూసింది పార్వతి....ఆందోళన, ఆవేదన వరిగను చేసింది... చెప్పాలనుకున్న మాటను చెప్పలేక పోయింది....

పార్వతి మనస్సును చూచాయగా అర్థం చేసుకున్న రంగరాజు—ఆమె అనురాగానికి అనుతాపం వెలిబుచ్చాడు.. తను పుట్టుక దరిద్రుడనీ, చేతినిండా సంపాదించగల విద్యా బుద్ధులుగాని, ప్రజ్ఞ గానీ తనకు లేదని చెప్పి, ఆమె మనస్సును మరో వేపు మరల్చడానికి ప్రయత్నించాడు...అయితే పార్వతి అతని ప్రగల్భాలకు ఆదర పూర్వకంగా చిరునవ్వు చిలికించింది...తను గూడా వాటిలాగే ఏకాకిననీ, శారద పెంపకంలో—అతనితో బాటు తను కూడా బాధ్యత వహించగలదనీ—పట్టుగా తన ఆశయాన్ని తెలియజేసింది. అతనికి తోడు నీడై జీవించడంలో తనకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని చెప్పినప్పుడు— పార్వతి మాటను

నిరాకరించలేక పోయాడు రంగరాజు......

కొన్నాళ్ళకు రంగరాజు పార్వతీలు దంపతు లయ్యారు. టీచరమ్మ తనకు వదినగా వచ్చిందన్న సంతోషంతో—శారద ఉప్పొంగి పోయింది....

పార్వతిని చే పట్టిన వేళా విశేషమల్లనేమో— రంగరాజు జీవితంలోనూ, ఉద్యోగ వృత్తిల్లోనూ విశేషమైన మార్పులు జరిగాయి. పెద్ద కంపెనీలో ఉద్యోగ మార్పు జరగడం మూలంగా— మొదటి కంటే రెండు రెట్లు జీతం డబ్బులు లభించాయతనికి! ఆలుమగల జీవితాల కలయిక వల్ల, వాళ్ళ కుటుంబం హాయిగా జీవించింది. శారద చదువు గూడా సక్రమంగా సాగింది.......

రోజులు గడిచాయి.........

శారద ఆయిదవ ఫారం చదువుతున్న సమయం లోనే— ఆ విషాద సంఘటన జరిగింది... కంపెనీలో సంభవించిన అగ్ని ప్రమాదానికి రంగరాజు ఆహుతి అయ్యాడన్నవార్తవిని, పార్వతి హృదయంలో అగ్ని పర్వతం బ్రద్దలయింది. తన జీవిత సౌధానికి పెనవేయబడ్డ అనేక లతలు, పుష్పించక ముందే పెకలింప బడ్డట్టు కుమిలిపోయింది. జీవిత సుఖాలకు దూరం కావాలని సమాజం శాసించింది. పసుపుకుంకుమల అలంకరణకు అర్హురాలు కాదని శిక్షించింది శాస్త్రం.

ఆశలను అణచుకోలేక—బాధ్యతా బ్రతుకులతో కొంతకాలం పోరాడింది పార్వతి. జీవించిన కొంత కాలంలోనూ—రంగరాజు తోటి మధుర స్వప్నాలు — ఆమెను బాధ్యతను గురించి హెచ్చరికలు చేసాయి. శారద తన కాళ్ళమీద తను నిలబడగలగడానికి మార్గం చూపించాలన్న భర్త ఆజ్ఞను, ఆమె పూర్తిగా, నిశ్చయంగా మరిచిపోలేక పోయింది.

శారద స్కూల్ ఫైనల్ పాసయి, ట్రైనింగ్ పూర్తి చేసి, పిదప పంతులమ్మ ఉద్యోగం ప్రవేశించే సరికి—ఆమె వయస్సు, యువనం పండుకుంది...

యువతుల యవ్వనంలోని మకరందానికి ప్రాకులాడే యువకులు, వాళ్ళు చేసే నీచమైన అల్లరి తన గురించి కోకొల్లలుగా సంఘటనలూ, కథలూ విన్న పార్వతి— సంపదనా, అందం అబ్బిన శారద విషయంలో మెల్కొని, ఆమెకు తగిన వరుడి కోసం అన్వేషణ ప్రారంభించింది....

• • •

ఎదుట చూపినంతకంటే మిన్నగా, శారదకు రమణమూర్తి భర్తఅయ్యే అర్హత గలవాడని నిశ్చయించుకుంది పార్వతి. అతను ఒక రోజు తమ ఇంటికి వచ్చి నప్పుడు, అతని జీవిత విలువలను గురించి లెక్క కట్టిందామె.

రమణ మూర్తి రైల్వే శాఖలో ఉద్యోగం చూస్తున్నాడు... ఉద్యోగంలో పైకి రాగల సూచనలున్నాయని ఆశించవచ్చునని విన్నప్పుడు, అతనిని చేపట్టడం మూలంగా— శారద జీవితం మెరుగు కాగలదని ఆశించింది పార్వతి. శారదకు సరితూగే అందగాడు కాకపోయినా, శుభ్రమైన బట్టలతో, ఆరోగ్యంగా ఉండడానికి శ్రద్ధ చెల్లిస్తాడతడు ఎదుట వారిని నవ్వించి, కవ్వించగల—తమాషి వాక్చాతుర్యంగల ఘనుడతడు.. అతను ఏకాకిగా గావడం మరొక విశేషం.!

కట్నం కానుకలను నిరాకరించి, శారదను చేపట్టడానికి సిద్ధమయిన అతన్ని, నవయువక సంఘాలో మార్గదర్శకుణ్ణిగా పరిగణించింది పార్వతి! తను అంతవరకూ ఏకాకిని గావడంవల్ల, పెళ్ళయిన తర్వాత—వాళ్ళతోనే ఉండిపోదలచినట్టు చెప్పాడు రమణమూర్తి. అతని కోరికను కాదనలేకపోయారు.

పెళ్ళి ఘనంగా జరిగింది.

తన భర్త ఆశయాన్ని సంపూర్ణంగా నెరవేర్చినందుకు—భర్త చిత్తరువును ఆనంద బాష్పాలతో తుడిచింది పార్వతి.

నూతన దంపతుల ఆనందజీవితం ప్రారంభమయింది. భర్త కోరికపై శారద, తన ఉద్యోగం చేయడం మానుకుంది. తన సంపాదన లోనే, ముగ్గురూ హాయిగా జీవించవచ్చునన్న రమణమూర్తి అభిప్రాయాన్ని పార్వతి కాదని చెప్పలేకపోయినా, తను మటుకు సంతులమ్మగానే ఉండిపోవాలని నిశ్చయం చేసుకుంది. ఆమె విషయంలో, తన కుటుంబానికి పెద్ద దిక్కుగా భావించిన ఆమె విషయంలో ఏలాగా కఠినంగానో, ఆమె మనస్సు నొప్పి పుట్టేలాగా తను ప్రవర్తించలేకపోయాడు.

హృదయాలు విప్పి, స్వేచ్ఛగా ఆడుకోవలసిన ఆ నూతన దంపతుల ఆనంద జీవితాలకు మధ్య, తాను మధ్య ముళ్ళపొదనై ఉంటున్నానన్న అనుమానం కలిగి—ఒకరోజు, వాళ్ళతో—తను కొంత కాలంపాటు తన స్నేహితురాలింట్లో ఉండదలచినట్టు చెప్పింది పార్వతి.

ఆమాటలు విని దంపతులిద్దరూ చలించి పోయారు.

''ఇది మీ యిల్లు!.... ఇది మీ సొమ్ము!.. మా ఆనందం కోసం, మా సుఖం కోసం— మీరు ఇల్లు వదిలి ఉండాలనడంలో న్యాయం లేదు. పోయితే, మేమే ఇంకోచోటికి వెళ్ళి పోతాం!'' అన్నాడు రమణమూర్తి.

''వద్దు మూర్తీ!.... ఎవరూ ఎక్కడికి వెళ్ళాలన్న వివాదం ఇంతటితో ఆపుకుందాం...'' అని బిగ్గరగా అరిచింది పార్వతి. తన మాటల్లోని విచిత్ర అర్థాలకు ఆ దంపతులు తన్నుండి వేరు కావడం ఆమె మనస్సు ఒప్పుకోలేదు.

కాని, రమణమూర్తి హృదయంలో మాత్రం తాము ఎప్పటికైనా వేరుపడవలసిన వాళ్ళమే కాబోలన్న సంశయం గట్టిగా బలపడింది. ఆ విషయాన్ని ఒకా రోజు శారదకు చెప్పి, పార్వతి బాధలకు తాము బాధ్యులు కాకూడదనీ, తామిద్దరం వేరుకాపురం వుంటే ఉచితంగా వుంటుందనీ—తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. శారద అతని వాదాన్ని ఖండించి, పార్వతి అలాంటి వ్యక్తి కాదనీ, ఆమె ఆజన్మాంతం తమ దగ్గరే ఉండిపోగలగాలనీ చెప్పింది.

కాలప్రవాహం మెల్లగా సాగింది.

రమణమూర్తికి అప్పుడప్పుడు ఉద్యోగవేళలు మారుతూ వుండేవి. ఆ పరిస్థితిని అతను రాత్రిళ్లలో చాలా పొద్దుపోయిన తర్వాత యింటికి చేరుకునేవాడు. అప్పటికి ఒళ్ళు మరచి నిద్రలో వుండే శారదను లేపి, భోజనం పెట్టడం వగైరా పనులను చేయించడం, పార్వతి మనస్సు నన్ను

# నువ్వే - నవ్వు

నువ్వే నవ్వు
నవ్వే నువ్వు
పువ్వులందం పుణికి
పుచ్చుకున్నావు.

1\. కంటిలో నీలాలు
కదలాడితే చాలు
వింటి నుండి పూలు
విసిరిన చందాలు.

2\. ఉంగ్రాల ముంగురులు
ఒయ్యారముగ కదలు
ఝంకారములు మాని
చలియించు తుమ్మెదలు

3\. అడుగులంటిన చోట
అందాల పూదోట
ఆటలాడిన చోట
తేట వెన్నెల బాట

4\. మధుర మంజులము నీ
మర్మమెరుగని భాష
వింతరీతుల సాగు
వినువారి హృదిలాగు.

5\. వగడాల ముత్యాలు
పదివేల వరహాలు
బంగారు రంగారు
పాప నీ తరహాలు.

శ్రీ బి.వి.నరసింహారావు

తించలేదు. ఆమె నిద్రలేచి, అతనికి భోజనం పెట్టేది. ఆ సమయంలో తనకు తోచినదల్లా చెపుతూ సెంకితనంగా అల్లరి చేసేవాడు మూర్తి. "అక్కయ్యా!" అని పిలుస్తూ అతడు తనతో మాట్లాడుతున్నప్పుడల్లా పార్వతి అంతరంగం పూరించిపోయింది.

కాని, పార్వతి పరిచర్యను కొంతకాలం వరకూ మంచిగా ఎంచిన శారద, కొన్ని రోజుల తర్వాత వాళ్ల అల్లరిలో—తనను మోసంచేయుగల స్థాయి నిండివుందని అనుమానించింది. ఆ అనుమానం రోజురోజుకూ బలపడిపోయింది. తన అబలత్వాన్ని, ఏంచెయ్యాలన్న ఆలోచన కూడా శారదకు కలగలేదు.

ఒకరోజు—

వీధి తలుపులు మెల్లగా తట్టిన చప్పుడయింది. అంతవరకూ నిద్రపట్టక మేల్కొని శారద, తన భర్త వచ్చాడన్న ఆతురతతో పడక నుండి లేచి—తలుపు తీయబోయింది. కాని, అప్పటికే పార్వతి తలుపు తీయడం మూలంగా రమణమూర్తి లోపలికి వచ్చాడు. ఎదురయిన శారదను విచిత్రంగా చూశాడు.

"వాకోసం నిద్రలేచి వచ్చావా, శారదా!... చాలా మెచ్చుకోదగ్గ విషయమే! కాని, ఇప్పుడు మున్నన్న పరిస్థితుల్లో—శరీరాన్ని అట్టే కష్టపెట్టుకోవటం మంచిదికాదు, వెళ్లి పడుకో. అన్నం పెట్టడానికి అక్కయ్య వస్తుందిగా!..." అన్నాడు రమణమూర్తి.

భర్త మాటలు శారద హృదయాన్ని నొప్పించాయి. చిరునవ్వుతో అమాయకురాలుగా నిలుచున్న పార్వతివేపు అసహ్యంగా చూసి, తన గదికి వెళ్లిపోయిందామె. పడకలో వుందేగాని, శారద మనస్సు కల్లోలాలతో నిండిపోయింది. అవతల వంట గదినుండి, పార్వతి నవ్వుతూ, రమణమూర్తి కేరింతలూ గాలిలో కలిసివచ్చి ఆమె చెవులలో గింగురుమంటున్నాయి. ఆ అల్లరులు తన జీవితాన్ని నాశనం చేయగల పిశాచాల కేరింతలై ఆమెను బాధపెట్టాయి. ఇద్దరూ కలిసి—తనకు ద్రోహం చేయబూనుకున్నారని నిశ్చయించుకుంది.

తనకున్న అనుమాన జ్వాలలతో—వాళ్లను ఎదిరించి మాట్లాడాలన్నంత ఆవేశం కలిగినా, శారద అలా చేయలేకపోయింది. ఒకవేపు — తనను పెంచి పెద్దచేసిన తన వదిన—పార్వతి! మరొకవేపు తన జీవితంలో భాగం పంచుకున్న భర్త—రమణమూర్తి! తనకున్న అనుమానాన్ని గట్టిగా పెనవేసుకుని, వాళ్లని మందలించగా ఆ అనుమానమే పెనుభూతమై, అందరి జీవితాల లోనూ సుడిగాలులు లేవదీస్తే!!.... తనందుకు బాధ్యురాలు కాకూడదనుకుంది, పోనీ తను చేయదగినదేమిటి?

తామిద్దరూ వేరే కాపురం వెళ్లాలన్న—ఒకప్పటి భర్త ఆశయాన్ని గుర్తుకు తెచ్చుకుంది. శారద.... తాము వేరే కాపురం పెట్టుకోవడం వల్ల, పార్వతి బెడద వుండదన్న నమ్మకం కూడా కలిగింది... ఉదయం లేవగానే, తన ప్రయత్నంలోకి దిగాలన్న నిశ్చయంతో ఒళ్లు మరిచి నిద్రపోయింది శారద.

ఉదయం నిద్రలేచిన తర్వాత, పార్వతి దగ్గర తాము వేరు పోవడం గురించిన నిశ్చయాన్ని చెప్పడానికి ఆమె గదికి వెళ్లింది శారద.. ఆగదిలో పార్వతి కనిపించలేదు.. ఇంటి పనులు చేసుకుంటోందనే ఆ తలపుతో వంటగదిలోనూ, పెరటిలోనూ చూసింది. అయినా, పార్వతి ఎక్కడా కనిపించలేదు.... శారద మదిలో భీతి ముట్టుకుంది. 'వదినా!వదినా' అని కేకలేస్తూ యిల్లంతాకలయ తిరిగి వెదికింది...పార్వతి జాడ కనిపించలేదు..కాని, హాలులో రంగరాజు చిత్తరువు దగ్గర— టేబిలు మీద, గాలికి రెపరెపలాడుతున్న ఓ కాగితం—శారద కళ్లపడింది.. ఆమె హృదయం ఆందోళనతో బాధపడింది.. వణకుతున్న చేతులతో, ఆ కాగితాన్ని తీసి చదివింది.

"శారదా

బాగా బ్రతకాలనుకున్న కొందరికి, వారిని అనుసరించే పరిణామాలు—వారికి చరిత్రల్ని చేస్తాయి...నా బ్రతుకూ అలా పోగాలన్న అభిప్రాయం— నాకెప్పటికీ లేదు.. పరిశుద్ధంగా ప్రవర్తించే మూర్తి అల్లరిలో నేను అనుభవించవీలులేని కొన్ని అనుభూతులు నాలో చెలరేగ మొదలెట్టాయి.. ఆ అనుభూతుల వల్ల నీజీవితం విషాద గీతమవ్వడం—మా అన్నయ్యకు నేను ద్రోహాన్ని తల పెట్టడం—రెండూ జరగరాదు...కాబట్టి చలించిన హృదయంతో నేను యింటిలో ఉండడానికి నా కిష్టం లేదు.. దూరంలో వున్న నా స్నేహితురాలింటికి వెడుతున్నాను... నన్ను గురించి విచారపడకు.. నీ భర్తతో—హాయిగా— ఆ యింటిలోనే కాలం గడపండి. నీకు నా ఆశీస్సులు......

—పార్వతి

"వదినా!" అంటూ ఉత్తరాన్ని ముఖానికి కప్పుకుని భోరున విలపించింది శారద.. ఆమె ఏడుపు విన్న రమణమూర్తి నిద్ర మేల్కొని ఆమెను సమీపించాడు.. జరిగినదేదో తెలుసుకుని—బాధ పడ్డాడు.

"తోబుట్టువు అన్న ఆత్మీయతతో ప్రవర్తించినందుకు, మా వదిన జీవితంలో ఇంతటి తుఫాను చెలరేగుతుందని తెలిసి వుంటే నేనిలా నడుచుకోకనే ఉండి పోదును! మా వదిన నీనుండి దూరమవడానికికారకుడనైన నన్ను క్షమించు శారదా!" అంటూ, తన భార్య కళ్లల్లోకి చూశాడు. రమణమూర్తి....

ఏ కారణంచేతనో, శారద! కను రెప్పలు మూసుకున్నాయి! ★

పాకాల సరస్సు. —చంటి

